క్లుప్తంగా

నీ ఓటు–నీ బాధ్యతపై అవగాహన ర్యాలీ



గుల్లలమోద(నాగాయలంక): మండలంలోని గుల్లలమోద గ్రామంలో గురువారం స్వయం సహాయక సంఘాల సభ్యులకు నీ ఓటు–నీ బాధ్యత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం కె.వై.దాసు నేతృత్వంలో ఓటు హక్కు అంశంపై నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. వీఓఏలు, సీసీలు, వీవో ప్రెసిడెంట్లు, డ్వాక్రా సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నివారణపై అవగాహన



నాగాయలంక: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి, రాష్ట్ర ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నాగాయలంకలోని వివిధ కూడళ్లలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ, నిర్మూలన అంశాలపై ప్రజలకు కళాకారుల బృందం సభ్యులు అవగాహన కలిగించారు. సంస్థ ప్రతినిధి కోటేశ్వరమ్మ మాట్లాడుతూ హెచ్ఐవీ నిర్ధారణకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఐసీటీసీ సెంటర్స్‌లలో రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయవ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ పొందిన ఎం.శేఖర బాబు నేతృత్వంలోని కళాకారులు ప్రజలకు అర్థమయ్యే రీతిలో నాటికలు ప్రదర్శించారు.

హంసలదీవి సముద్రస్నానాలకు ప్రత్యేక బస్సులు

అవనిగడ్డ: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని కోడూరు మండలం హంసలదీవి సముద్రస్నానాలకు వెళ్లే భక్తుల కోసం ఈ నెల 23, 24 తేదీల్లో ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ కె. హనుమంతరావు తెలిపారు. అవనిగడ్డ డిపో నుంచి హంసలదీవికి ఈ నెల 23వ తేదీ సాయంత్రం నుంచి 24వ తేదీ సాయంత్రం వరకూ ఈ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామని చెప్పారు. భక్తులు ఈ సర్వీసులను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పిట్టల్లంకలో శిలువ మార్గం



పిట్టల్లంక(కోడూరు): మండల పరిధిలోని పిట్టల్లంక ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో శిలువ మార్గం నిర్వహించారు. మొత్తం 14 స్థలాలను గుర్తుగా వేసుకుని అక్కడ పరలోక జపం, ప్రార్థనలు చేశారు. పాటలు పాడుకుంటూ ముందుకు సాగారు. అనంతరం కోడూరు ఆర్‌సీఎం చర్చి గురువు చొటపల్లి శ్రీకాంత్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతాన్ని వివరించారు. అలానే మానవుల పాపాలను పరిహరించేందుకు ఆయన మానవ రూపంలో ఈ లోకంలోకి వచ్చిన తీరుని విశ్వాసులకు తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు. పలువురు ఉపదేశిలు, సంఘ పెద్దలు, సంఘస్తులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ



మచిలీపట్నంటౌన్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం దేవునితోట యానాదులకాలనీలోని పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. బ్యాంక్ రీజనల్ హెడ్ కె.వెంకట్రావు 200 మంది పేదలకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ 3 వేల కోట్ల క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషన్ ప్లేస్‌మెంట్‌ను విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా సామాజిక బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అలాగే ఈడేపల్లి వృద్ధాశ్రమంలో కూడా వృద్ధులు, వికలాంగులకు ఆహార పొట్లాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ కార్యాలయ సిబ్బంది, బ్యాంక్ రిటైర్డ్ స్టాఫ్ మొహమ్మద్ మున్నీర్, కె. సాయి మోహన్ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

చల్లపల్లి: 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అన్నారు. కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయం సమీపంలో గురువారం రెండు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. రూ.4.95 లక్షలతో రెండు సీసీ రోడ్ల నిర్మాణ పనులను భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, ఈఓ పేర్ని మాధవేంద్రరావు, ఇంజినీరింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు నిరుపమానం

వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి రమేష్



కృత్తివెన్ను మండలం వజ్ర పురస్కార గ్రహీత వలంటీర్‌ను సన్మానిస్తున్న హారిక, రాము తదితరులు

పెడన: ప్రజల హృదయాల్లో వలంటీర్లు పదిలమైన స్థానం సంపాదించుకున్నారని ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో పెడన నియోజకవర్గంలోని వలంటీర్లకు వందనం కార్యక్రమం గురువారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్ (రాము)తో కలిసి హారిక వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తొలుత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి హారిక ప్రసంగించారు. గత ప్రభుత్వంలో పింఛను కోసం పడ్డ ఇబ్బందులు, నిరీక్షణ వంటి దుస్థితి ఇప్పుడు లేకుండా నేరుగా ఇంటికి తీసుకువచ్చి ఇచ్చేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిందనే వివరాలను తెలియజేయాలని స్పష్టం చేశారు. కరోనా సమయంలో వలంటీర్లు పడ్డ కష్టాన్ని గుర్తించి వారికి పురస్కారాలు అందజేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్ (రాము) మాట్లాడుతూ జగనన్న వారియర్స్‌గా పిలవబడుతున్న వలంటీర్లు సేవలు నిరుపమానమని చెప్పారు. ఉన్న ఊరిలోనే సేవ చేసేలా వలంటీర్లు నడుచుకోవడం అభినందనీయమని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.55 లక్షల మంది వలంటీర్లు, 1.25 లక్షల మంది సచివాలయ ఉద్యోగులను నియమించి సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను చేరువ చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో ఐదుగురు వలంటీర్లుకు వజ్ర, 25 మందికి సేవారత్న, 1,174 మందికి సేవామిత్ర పురస్కారాలు వచ్చాయని వెల్లడించారు. సమావేశంలో ఆర్టీసీ రీజియన్ చైర్మన్ పిన్నింటి మహేష్, పెడన, బంటుమిల్లి ఏఎంసీ చైర్మన్లు చారుమతి, గంగాధర్, ఎంపీపీలు చినబాబు, గరుడప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నాగబాబు, వెంకట్రాజు, మల్లి, మహేష్, జెడ్పీటీసీలు రత్నకుమారి, వెంకటరమణ, పార్టీ నాయకులు తిరుమాని శ్రీనివాసరావు, జల్లా భూపతి, పట్టపు నాగేశ్వరరావు, అచ్చుతరావు, భైరవలింగం, కటకం ప్రసాద్, అయాబ్‌ఖాన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఎంపీడీవోలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తక్షణం పరిష్కరించండి

అధికారులతో సమీక్షించిన వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రమేష్



అధికారులతో సమీక్షిస్తున్న ఉప్పాల రాము, పక్కన హారిక తదితరులు

పెడన: నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇనచార్జి ఉప్పాల రమేష్ (రాము) అన్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం ఉన్న మేరకు ఇంటి స్థలాలు చూపి పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేయాలని సూచించారు. మండలాలు, గ్రామాలు వారిగా ఇళ్ల స్థలాలు పరిస్థితి, అనుకూలంగా ఉన్నవి, లేనిది పరిశీలించి లబ్ధిదారులకు ఇవ్వాలని తెలిపారు. ఇల్లు వీరికి తప్పనిసరిగా అవసరం ఉందని భావించిన వారికి ప్రాధాన్యం కల్పించాలని కోరారు. పింఛన్లు కోసం అర్హులైన వారున్నారని, అటువంటి వారిని గుర్తించి పింఛన్లు మంజూరు చేయాలన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి పింఛన్లు, రైస్‌కార్డులు జారీ చేయడం జరుగుతుందని అధికారులు వివరణ ఇచ్చారు. అర్హులుంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం విషయమై ఆరా తీశారు. ఆర్ డబ్ల్యూఎస్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ రోడ్లు తదితర వాటిపై సమీక్షించారు. అక్కడక్కడ రోడ్లు అసంపూర్తిగా వేసి ఉంచారని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం నాగకుమారి, ఏఎంసీ చైర్మన్లు చారుమతి, గంగాధర్, ఎంపీపీలు వెలివెల చినబాబు, సంగా మధుసూదనరావు, గరుడప్రసాద్, జడ్పీటీసీలు వేముల సురేష్‌రంగబాబు, మైలా రత్నకుమారి, మలిశెట్టి వెంకటరమణి, మండల, పట్టణ కన్వీనర్లు నాగబాబు, పర్లం పెదబాబు, వెంకట్రాజు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖలకు చెందిన జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్‌నెట్ కనెక్షన్లు ఏర్పాటుచేయండి

సెల్‌ఫోన్ నెట్‌వర్క్ ప్రతినిధులతో కలెక్టర్ రాజాబాబు



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సరైన టవర్ సిగ్నల్స్, బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్లు వారం రోజుల్లోగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. క్యాంపు కార్యాలయంలో బీఎస్ఎన్ఎల్, జియో ఫైబర్‌నెట్, వోడాఫోన్ సర్వీస్ ప్రొవైడర్ల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పలు రకాల సాంకేతిక యాప్‌లను వినియోగించాల్సి ఉందన్నారు. ఇందుకోసం ప్రత్యేకమైన బ్రాడ్ బ్యాండ్ సౌకర్యంతో అంతర్జాల కనెక్షన్లను వారం రోజుల్లోగా ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వారీగా సమాచార లోపం లేకుండా స్ట్రాంగ్, మీడియం, వీక్ టవర్ల సిగ్నల్స్ జియో కో–ఆర్డినేట్ వివరాలను అందజేయాలని కోరారు. కలెక్టరేట్‌లో ఒక కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని అక్కడ బీఎస్ఎన్ఎల్ కనెక్షన్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు వారి రాజకీయ ప్రచార ప్రకటనలు ముఖ్యంగా బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు వంటివి ఓటర్లకు పంపే ముందు తప్పనిసరిగా ఎంసీఎంసీ నుంచి అనుమతిపొందాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కమ్యూనికేషన్ ప్లాన్ నోడల్ అధికారి, సీపీవో గణేష్‌కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ విజయకుమారి, బీఎస్ఎన్ఎల్ డీజీఎం ఉమామహేశ్వరరావు, ఎయిర్‌టెల్, జియో, వొడాఫోన్, ఫైబర్‌నెట్, ఆక్ట్ కంపెనీ ప్రతినిధులు చక్రధర్, రవిబాబు, ఎం భాను, అబ్బాస్ హుస్సేన్, లక్ష్మీనారాయణ, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు దుర్గాకిషోర్, డెప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌నాథ్ పాల్గొన్నారు.

పోర్టు నిర్మాణంతో మెండుగా ఉద్యోగావకాశాలు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు



సిమెంటు రోడ్డు పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న పేర్ని కిట్టు చిత్రంలో మేయర్

మచిలీపట్నంటౌన్: పోర్టు నిర్మాణం పూర్తయిన వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు మెండుగా లభిస్తాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 7వ డివిజన్‌లో గురువారం రూ. 7.52 లక్షలు, రూ. 4.92 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు, పైప్‌లైన్ నిర్మాణ పనులను ఆయన టెంకాయకొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ పోర్టు నిర్మాణం పూర్తయిన తరువాత జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో, రాష్ట్రాల్లో ఉపాధి కోసం వెళ్లిన బందరు యువతకు ఇక్కడే ఉద్యోగావకాశం లభిస్తుందన్నారు. ఉపాధి లేమితో ఇతర ప్రాంతాలకు వెళ్లిన ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశం కల్పించే బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. అలాగే సీఎం జగన్ ప్రత్యేక దృష్టితో మచిలీపట్నంలో పలు అభివృద్ధి పనులు జరిగాయని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి 2024 ఎన్నికల అనంతరం కూడా కొనసాగేలా చూస్తామని తెలిపారు. మచిలీపట్నం ప్రాంత అభివృద్ధి మునుపెన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే జరుగుతోందని తెలిపారు. ఆయనకు ఈ ప్రాంతవాసులందరూ తోడుగా ఉండి మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్లు పడమట రేవతి, మిరియాల బసవపూర్ణమ్మ, పల్లి శేఖర్, కో–ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసీ, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్‌లు పడమట రమేష్, మొహమ్మద్ రఫీ, బూరగ రామారావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చలమలశెట్టి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా షాపుల్లో తనిఖీలు

కోడూరు: మండలంలోని ఆక్వా మందుల షాపుల్లో మత్స్యశాఖ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రోబయోటిక్స్, మినరల్స్, మేత బ్యాగ్‌లను పరిశీలించారు. షాపుల నిర్వహణలో అవసరమైన ఏపీ ఎస్ఏఏడీఏ యాక్ట్ గురించి దుకాణదారులకు ఎఫ్‌డీఓ వానపల్లి సత్యనారాయణ వివరించారు. ప్రొడక్షన్ లేబిలింగ్, సీఏఏ రిజిస్ట్రేషన్ ప్రతి మందు మీద సరిగ్గా ఉండేలా చూడాలని సూచించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వీఎఫ్ఏలు నరేంద్ర, మదరసా పాల్గొన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి



ఉత్సవాలపై సమీక్షిస్తున్న ఆర్డీవో వాణి తదతరులు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న దుర్గా, పార్వతి సమేత నాగేశ్వరస్వామివారి వార్షిక మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి తెలిపారు. మండలంలోని పెదకళ్లేపల్లిలో మహాశివరాత్రి ఉత్సవాలపై ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరావు సమక్షంలో అధికారుల సమీక్షా సమావేశం గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మార్చి 5 నుంచి 13వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు అధికారులు, ప్రజల సహకారంతో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. శాఖల వారీగా అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఆలయ ఏసీ చక్రధరరావు మాట్లాడుతూ ప్రధానంగా మార్చి 7, 8, 9 తేదీల్లో భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారని చెప్పారు. ఆ సమయంలో భక్తులకు ఉచిత ప్రసాదం, వాటర్ సరఫరాతో పాటు అధికారులకు ఉచిత భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దేవాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించనున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీ వైద్యులు అనిల్ మాట్లాడుతూ 8వ తేదీన పీహెచ్‌సీ, రెండు ఘాట్స్ వద్ద మూడు మెడికల్ క్యాంపు ఏర్పాటుచేయడంతో పాటు మూడు అంబులెన్స్‌లు సిద్ధం చేస్తామని తెలిపారు. మత్స్యశాఖ నుంచి 8 బోట్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతామన్నారు. ఆర్టీసీ నుంచి మచిలీపట్నం, అవనిగడ్డ డిపోల నుంచి 40 బస్సులు ఏర్పాటు చేస్తామని ఆయా శాఖల అధికారులు తెలిపారు.అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ 350 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ నుంచి పుష్కర ఘాట్స్ వద్ద టాయ్‌లెట్స్, దుస్తులు మార్చుకునేందుకు గదులు, శానిటేషన్ ఏర్పాటు చేస్తామని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. అంతకుముందు శ్రీ దుర్గా నాగేశ్వరస్వామివారిని ఆర్డీవో దర్శించుకున్నారు. గ్రామ సర్పంచ్ అరజా సంధ్యారాణి, ఎంపీటీసీలు అరజా ఆశాదేవి, కడవకొల్లు సీతారామాంజనేయులు, తహసీల్దార్ మేడపాటి శ్రీ విద్య, ఎంపీడీఓ కె. శ్రీనివాసరావు, చల్లపల్లి సీఐ నాగప్రసాద్, ఎస్ఐ వైవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆలోచనా దినోత్సవం



గూడూరు: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో వరల్డ్ థింకింగ్ డేను గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.పుష్పలత స్కౌట్స్ గైడ్స్ వ్యవస్థాపకుడు లార్డ్ రాబర్ట్ స్టీఫెన్సన్ స్మిత్ బెడెన్ పావెల్, ఆయన సతీమణి లేడీ ఓలేవ్ బెడెన్ పావెల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గైడ్స్, స్కౌట్స్‌ల మధ్య వసుధైక సోదరీమణుల బాంధవ్యాన్ని ఏర్పరచడానికి దీనిని శ్రీకారం చుట్టారన్నారు. 1999 వరకు ఇది అమెరికాకు మాత్రమే పరిమితమైనా ఆ తర్వాత ప్రపంచ ఆలోచనా దినోత్సవంగా మార్చడం జరిగిందన్నారు. మన ప్రపంచం, అభివృద్ధి చెందుతున్న మన భవిష్యత్తు– పర్యావరణం ప్రపంచ పేదరికం అనే అంశాలను ఈ ఏడాది నేపథ్యంగా ఎంచుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పీడీ మత్తి అరుణ, ఉపాధ్యాయులు, స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో గర్భిణికి నార్మల్ డెలివరీ



ఘంటసాల(అవనిగడ్డ): గత ప్రభుత్వంలో ఏరియా వైద్యశాలలు, ప్రభుత్వాసుపత్రుల్లో డెలివరీలు జరిగేవి కావు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన చర్యల వల్ల నేడు పీహెచ్‌సీల్లోనూ డెలివరీలు జరుగుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం రాత్రి ఘోటకం కాలనీకి చెందిన అమృత సంధ్య అనే గర్భిణి రాగా డాక్టర్ ప్రమోద్ కుమార్ ఆమెను పరీక్షించి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం నార్మల్ డెలివరీ జరగ్గా మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు. పీహెచ్‌సీలో డెలివరీ కేసులు చూస్తున్నామని గర్భిణులు ఈ అవకాశాన్ని వినిగించుకోవాలని ప్రమోద్ కుమార్ కోరారు.

ఆంగ్ల మాధ్యమం అనివార్యం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



కబడ్డీ ప్రథమ స్థానం, ఓవరాల్ చాంపియన్ సాధించిన బాలలతో ఎమ్మెల్యే సింహాద్రి



నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

నాగాయలంక: నేటి ఆధునిక కాలంలో ప్రపంచ స్థాయిలో పోటీ పరీక్షలను ఎదుర్కొని అధిగమించాలంటే ప్రాథమిక విద్య నుంచే ఆంగ్ల మాధ్యమం అనివార్యమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. మండల స్థాయి బాల, బాలికలు, ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు ముగిసిన నేపథ్యంలో 30వ వార్షిక విద్యా, సాంస్కృతిక క్రీడా, బాలోత్సవాల బహుమతి ప్రదానోత్సవ సభ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ ఆవరణలో కళావేదికపై గురువారం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి, క్రీడల కమిటీ చైర్మన్ టీవీఎం రామదాసు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యా వ్యవస్థలో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రగతి విషయంలో సమూల మార్పులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని చెప్పారు. పేద పిల్లల చదువుల కోసం ఎప్పటికప్పుడు వినూత్న పథకాల అమలుతో ప్రైవేటు స్కూల్స్‌ను అధిగమించే దిశగా విద్యా రంగాన్ని నడిపిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని మరే మండలంలో లేని విధంగా గత మూడు దశాబ్దాలుగా పోటీలు దిగ్విజయంగా కొనసాగిస్తున్న మండల విద్యా కుటుంబం సేవలను ప్రశంసించారు. పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజలు, ఉపాధ్యాయులు ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేయవద్దని పేర్కొన్నారు. క్రీడలు, సాంస్కృతిక అంశాలు చదువుతో అనుసంధానమై సాగితేనే విద్యార్థులు పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా మనగలుగుతారని చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు కృషి, దాతల సహకారంతో 30 ఏళ్లుగా మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు క్రీడలు విజయవంతంగా నిర్వహించడం గొప్ప విషయమని కొనియాడారు. విజేతలైన 700 మందికి పైగా బాలలు, టీచర్లకు ఎమ్మెల్యే, ఇతర అతిథుల చేతుల మీదుగా క్రీడా, సాంస్కృతిక, విద్యావిషయక బహుమతులు అందచేసారు. తొలుత ఎమ్మెల్యే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, ఈ క్రీడలకు నాంది పలికిన దివంగత పీఈటీ వగ్రే రాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. మండలంలోని పలు పాఠశాలల చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వక్కపట్లవారిపాలెం ప్రాథమిక పాఠశాల చిన్నారులు అభినయించిన 'కొమ్మా ఊయాల కోన జంపాలా అమ్మా ఒళ్ళో నేను రోజూ ఊగాల... పాటలో చిన్నారులు ముద్దులొలికేలా హావభావాలు ప్రదర్శించి ఎమ్మెల్యే అభినందనలు అందుకున్నారు. పీఏసీఎస్ చైర్మన్ ముమ్మారెడ్డి సాంబశివరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, పాలెం సర్పంచ్ అంబటి శ్యామ్ ప్రసాద్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చిన జగనన్న

పేర్ని కిట్టు



జగనన్న కాలనీలో పక్కా గృహనిర్మాణానికి శంకుస్థాపన పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: పేదల సొంతింటి కలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 23వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లో పక్కా గృహ నిర్మాణాలకు నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పేదలకు ఒక్క ఇంటి స్థలం కూడా ఇవ్వకపోటవంతో ఎంతో మంది పేదలు నివేశనా స్థలాల కోసం ఎదురుచూశారని చెప్పారు. నగరంలో పలు వృత్తులు చేసుకుంటూ అద్దె ఇళ్లలో ఉంటూ అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పేదలకు నివేశనా స్థలాలు, పక్కా ఇళ్లు జగనన్న కట్టిస్తున్నారని వెల్లడించారు. దీనిలో భాగంగా 23వ డివిజన్‌లో అర్హత ఉన్న పేదలకు జగనన్న కాలనీ ఏర్పాటు చేశామని వివరించారు. లబ్ధిదారులు గృహాలను త్వరితగతిన నిర్మించుకుని నివాసం ఉండాలని కోరారు. కార్యక్రమంలో 23వ డివిజన్ కార్పొరేటర్, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మీ, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కో–ఆప్షన్ సభ్యులు బేతపూడి రవి, మట్టా తులసీ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పేర్ని కిట్టుకు ఆ ప్రాంత ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. దారి పొడవునా పూలు చల్లుతూ ముందుకు సాగారు. ఉల్లింగిపాలెంలో వైఎస్సార్ సీపీ స్థూపాన్ని, జెండాను పేర్ని కిట్టు ఆవిష్కరించారు.

ఘనంగా రక్షణ సైన్యం గృహ సమితి ర్యాలీ



నాగాయలంక రక్షణసైన్యం గృహసమితి ర్యాలీలో చెన్నై ప్రతినిధులు

నాగాయలంక: రక్షణ సైన్యం (సాల్వేషన్ ఆర్మీ) నాగాయలంక డీఓ ఆధ్వర్యంలో స్థానిక రాజేశ్వరీ కాలనీలో సంస్థకు చెందిన చర్చి ఆవరణలో సీనియర్ గృహ సమితి ర్యాలీ–2024 కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. రక్షణ సైన్యం జిల్లా మహిళా విభాగం అధికారి మేజర్ తెలగతోటి రత్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో లెఫ్టినెంట్ కర్నల్ కేజియల్ స్టాలిన్(చెన్నై), మెర్సీ మంజుల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మద్రాసు ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న తెలుగు గడ్డపై 1895లో విజయవాడలో తొలుత స్టాఫ్ కెప్టెన్ అబ్దుల్ అజీజ్ ఈ సంస్థను ప్రారంభించారని తెలిపారు. ప్రస్తుతం 700 గ్రామాల్లో వేలాది మంది అభాగ్యుల సేవలకు సంస్థ అంకితమై పనిచేస్తుందని చెప్పారు. సంస్థ అందిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. తొలుత రక్షణ సైన్యం ధ్వజాన్ని ఎగురవేసి, గృహ సమితి ర్యాలీ చేశారు. 160 మంది మహిళా ప్రతినిధులు హాజరైన కార్యక్రమంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మేజర్ సుధారాణి, కెప్టెన్ కెజియా, కెప్టెన్ సునీత, లెఫ్టినెంట్ సత్యవతి, అనిత తదితర నాయకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పెండ్లి కుమారుడిగా వేణుగోపాలుడు

హంసలదీవిలో బ్రహ్మోత్సవ శోభ



కోడూరు: హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, విశేషస్నపన, ఉత్సవమూర్తులకు అభిషేకాలను భక్తిప్రపత్తులతో జరిపారు. వేణుగోపాలుడిని పెండ్లి కుమారుడిగా, రుక్మిణీ, సత్యభామ అమ్మవార్లకు పెండ్లి కుమార్తెలుగా అలంకరించి పూజలు చేశారు. శృంగేరీ పీఠం ప్రతినిధులు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టారు. వేద పండితుల మంత్ర వచనాల నడుమ సాయంత్రం విష్వక్సేన పూజ, పుణ్యావచనం, దీక్ష స్వీకరణ, అఖండ దీపారాధన, వాస్తుపూజ, వాస్తుహోమం, అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు పుష్పాభిషేకాన్ని కనులపండువగా చేశారు. శుక్రవారం ఉదయం రాజ్యలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, రాత్రికి ఆరుబయట ఉన్న కల్యాణ వేదికలో స్వామివారి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మాధికారి కుప్పా సుబ్రహ్మణ్య అవధాని తెలిపారు.